

ప్రమాదభరితంగా ఉన్న ఫ్లై ఓవర్ కిందకు వచ్చే దారి



ఇటీవల ప్రమాదానికి గురైన వాహనం

ఇంకెన్నాళ్లీ సాగదీత?

• నత్తనడకన ఆర్‌వోబీ పనులు • ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద తరచూ ప్రమాదాలు • చోద్యం చూస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాఖ విద్య: ఎన్ఏడీ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. నిత్యం వాహనాల రద్దీ ఉంటే ఎన్ఏడీ సెంటర్‌లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ సాగదీస్తున్నారు. ఫలితంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పనుల్లో జాప్యం జరుగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్ష్యం ఇదీ

హైవేపై వాహనాల రాకపోకలకు సౌలభ్యంగా ఉండేలా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టారు. దీనికి రూ.28 కోట్లు నిధులు కేటాయించారు. అయితే పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తికాని పరిస్థితి ఉంది. ఆర్‌వోబీ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించినా, ఇంజినీరింగ్ అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవడంపై ప్రజానీకం మండిపడుతున్నారు.



ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు అనుసంధానంగా రైల్వే ట్రాక్‌పై చేపడుతున్న వంతెన



పనులు జరిగే చోట వాహనాల రద్దీ

కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం

ఆర్‌వోబీ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యంగా సాగుతుందోనే విమర్శలు ఉన్నాయి. పనులు చేపట్టే చోట రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతుండడంతో పాటు నిర్మాణ సామగ్రి కూడా రోడ్డుపైనే పడేస్తున్నారు. దీని వల్ల హైవేపై భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. పనులు చేపట్టే మూల మలుపు వద్ద హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో వాహనదారులు తికమకపడుతున్నారు. గాజువాక నుంచి వాహనాలపై వచ్చే వారు ఫ్లై ఓవర్ కింద దారికి వచ్చే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మలుపు వద్ద వెనుక వచ్చే వాహనాలు కంట్రోల్ లేకపోతే ప్రమాదాలు జరగడం ఖాయమని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

పట్టించుకునే వారేరీ?

ఎన్ఏడీ వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులపై గతంలో వీఎంఆర్‌డీఏ అధికారుల సమీక్ష ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనుల పురోగతిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు. పనులు జరిగే చోట వాహనాల రాకపోకలకు అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు

ఎన్ఏడీ వద్ద ఆర్‌వోబీ పనుల కారణంగా గాజువాక వైపు వెళ్లే దారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ డీసీఎం వ్యాన్-ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. అయినప్పటికీ వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారుల్లో చలనం లేదని వాహనదారులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆలోచింపజేసిన చిత్రప్రదర్శన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం శ్రీహరిపురం బ్రాంచ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఆలోచింపజేస్తుంది. బ్రహ్మకుమారీస్ సిస్టర్ సింధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో సృష్టి మూలానికి కారణాలు, ఆరంభానికి మూలాలు ఏ విధంగా ఏర్పాడ్డాయనే విషయాలను తెలియపరిచారు. ఆధ్యాత్మికతతో మనశ్శాంతి ఎలా పొందాలనే విషయాలను ప్రజలకు వివరించారు. యుగారంభం, బ్రహ్మయుగం ప్రారంభం వంటి విషయాలను తెలిపే చిత్రాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి.

ప్రమాదమని తెలిసినా..



జయేంద్రకాలనీలో మూత లేని మ్యాన్‌హోల్

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్ర కాలనీలో ఇటీవల డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. అయితే మూత ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు పడితే నీరు చేరి రంధ్రం కనిపించక అందులో జారీ పడుతున్నారని వాపోతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలికాకముందే సంబంధిత అధికారులు మేల్కొని మూతలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

జోరందుకున్న పైనాపిల్ అమ్మకాలు



గోపాలపట్నం రైతు బజారులో పైనాపిల్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజారులో పైనాపిల్ అమ్మకాలు జోరందుకున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ నుంచి గిరిజనులు తీసుకు వచ్చి ఇక్కడ అమ్మకాలు చేస్తున్నారు. వీరికి రైతు బజారులో ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. కిలో రూ.40కి నాణ్యమైన పండ్లు దొరుకుతుండడంతో వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. రోజుకు సుమారు 500 కిలోలు అమ్ముతున్నట్లు రైతుబజారు ఈవో ప్రసాద్ తెలిపారు.

చురుగ్గా మరమ్మతులు



కాలువ పనులను పరిశీలిస్తున్న రైతుబజారు ఈవో ప్రసాద్

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ దీపాలు వేయడం వంటివి పూర్తి చేశారు. ఇపుడు సివిల్ పనులు చేస్తున్నారు. కాలువలు, కొన్ని స్టాళ్ల మరమ్మతులు, రైతులకు స్టాళ్లు ఏర్పాటు చేయడం, పార్కింగ్ ఏరియాలో మరమ్మతులు చేయాల్సి ఉందని ఈవో తెలిపారు. దీంతో పాటు మరుగుదొడ్ల మరమ్మతులు కూడా చేయాల్సి ఉందన్నారు. శిథిలమైన కాలువలు బాగు పడుతుండడంతో వినియోగదారులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధమైన ప్రీ పెయిడ్ ట్యాక్సీ కౌంటర్



ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రీ పెయిడ్ ట్యాక్సీ కౌంటర్ దాదాపు పూర్తి కావచ్చింది. లోపల కూర్చునేందుకు ఫర్నిచర్, సాంకేతిక సామగ్రి వంటివి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ టికెట్లు అందించే విధంగా కంప్యూటర్, ప్రింటర్ విద్యుత్ పరికరాలు సమకూర్చే పనిలో ఉన్నారు. వీటిని సమకూరిన తర్వాత కౌంటర్‌ను ప్రారంభించనున్నట్లు గోపాలపట్నం పోలీసులు తెలిపారు. అంతే కాకుండా ట్యాక్సీ సర్వీసుల వారితో పాటు ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి నిర్ణయించాల్సి ఉంది. ఇందుకు ఆర్టీఏ అధికారుల సహకారం తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రజారోగ్యం పట్టదా?



దుర్గానగర్‌లో రహదారికి అడ్డంగా చెత్తాచెదారం



గొల్లకంచరపాలెం గెడ్డలో పందులు ఇలా...

ఫోకస్

ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. పారిశుధ్య నిర్వహణను గాడి తప్పించారు. పందులు స్వైర విహారం చేస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. చెత్త కుప్పలు పేరుకు పోవడం.. పందులు స్వైర విహారం చేయడంతో వ్యాధులు విజృంభిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినా ప్రజారోగ్య అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా జీవీఎంసీ 56,57 వార్డు పరిధిలో గొల్లకంచరపాలెం, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ, దయానందనగర్, ఫైడిమాంబకాలనీ, ముత్యమాంబ కాలనీ, రామ్మూర్తిపంతులుపేట, కాళ్లవారివీధి, గవరకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, సుభాష్‌నగర్, ఆశవానిపాలెం, తుమ్మడపాలెం, భవానీగార్డెన్స్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పరిసరాలను అపరిశుభ్రం చేయడంతో దుర్వాసన భరించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. కోళ్లు, పశు కళేబరాలను గెడ్డల్లో పడేస్తుండడంతో పందులు అక్కడికి చేరుతున్నాయి. జోన్-5 పబ్లిక్‌హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పందులను తరిమితే వాటి యజమానులు దాడులు చేస్తున్నారని వాపోతున్నారు. పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి పందులకు చెక్ పెట్టడడం తో పాటు చెత్తకుప్పలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– కంచరపాలెం



ముత్యమాంబకాలనీలో పందుల సంచారం



తోటవీధి గెడ్డలో సంచరిస్తున్న పందులు



సుభాష్ నగర్ ప్రధాన రహదారిలో పందుల స్వైర విహారం

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని పలు ప్రాంతాల్లో నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదివారం పర్యటించారు. సంజీవయ్యనగర్ సమీపంలోని కళావేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం వార్డులో గ్రీన్ బెల్ట్‌లో జరుగుతున్న హార్టీకల్చర్ పనులు పరిశీలించి వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజావసరాల మేరకు చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ సీట్ల అడ్మిషన్లపై దృష్టి సారించాలి

సీతంపేట: పేద విద్యార్థుల విద్యాభ్యున్నతి దృష్ట్యా అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ఉచిత సీట్ల అడ్మిషన్లలో లోటుపాట్లపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం 2009, సెక్షన్ 12(1)(సి)ను అనుసరించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో కేటాయించిన ఫ్రీ సీట్లలో అధిక శాతం పాఠశాలలు అడ్మిషన్లు నిరాకరించాయని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఎందుకు నిరాకరిస్తున్నాయో సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం సమావేశం నిర్వహించి ఉచిత విద్యకు ఎంపికైన వారికి సీట్లు కేటాయించేలా చూడాలని కోరారు.

బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ కులాల సంఘం నాయకులు

సీతంపేట: బీసీల్లో ఇప్పటివరకు రాజకీయ ప్రాధాన్యం లేని కులాలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని బీసీ కులాల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పార్టీలకతీతంగా బీసీ కులాల తృతీయ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు రేవు రత్నకుమారి, పావులూరి హనుమంతరావు, నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఏకమై తమ హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. ఇప్పటికే గుంటూరు, విజయవాడలో సమావేశాలు ఏర్పాటు చేశామని, అందులో భాగంగా విశాఖలో కూడా సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. అధికార పార్టీలు బీసీలకు తగు ప్రాధాన్యమిచ్చి చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. లేని పక్షంలో తమ హక్కులు సాధనకు పోరాటాలు చేస్తామని అన్ని పార్టీలను హెచ్చరించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై తనిఖీలు

అల్లిపురం: నగరంలోని ముఖ్య కూడళ్లలో ఆదివారం రాత్రి నాకాబందీలో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే విధంగా ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, అధిక లోడ్ వాహనాలు, వాహన రికార్డుల పరిశీలన, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ముమ్మర తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. 48 ముఖ్య కూడళ్లలో జరిగిన ఈ తనిఖీల్లో మొత్తం 115 వాహనాలు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో హెల్మెట్లు ధరించని 60 మంది ద్విచక్ర వాహన చోదకులు, నంబర్ ప్లేట్ సక్రమంగా లేని 16 వాహనాలు, 3 ట్రిపుల్ రైడింగ్, 12 సెల్‌ఫోన్ డ్రైవింగ్, 19 మోటార్ వెహికల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్

సీతంపేట: విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రపంచ సంగీత దినోత్సవం, జాతీయ పుస్తక పఠన మాస వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. సంగీతం, సాహిత్యం, కళల ఉత్తేజకరమైన సమ్మేళనాన్ని ఆకట్టుకునేలా అందించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథకురాలు, వాయిస్ ఆర్టిస్ట్ ఎం.సీతాశ్రీనివాస్, పూర్వ విద్యార్థులతో కలిసి సంగీతంతో శ్రావ్య వినోదం అందించారు. మొదటి సెషన్‌లో బుందేల్ ఖండ్ జానపద కథ 'వాట్ ఏ సాంగ్' ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు కథపై చర్చించారు. వర్క్‌షీట్లు నింపి రంగులు వేశారు. రెండో సెషన్‌లో సంగీతంపై



కథ చెబుతున్న వాయిస్ ఆర్టిస్ట్ సీతాశ్రీనివాస్

మక్కువ, గిటార్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న బాలుడి స్ఫూర్తిదాయ ప్రయాణాన్ని వివరించారు. లైవ్ గిటార్ ప్రదర్శన, కొంకణి పాట అలరించింది. ఈ సందర్భంగా పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎ.స్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి యాక్టివిటీస్‌లో పిల్లలను నిమగ్నం చేయడం వల్ల వారిలో సృజనాత్మకత, ప్రతిభకు అద్దం పట్టవచ్చన్నారు.

ప్రభుత్వ విధానాల్లో మార్పుతోనే అభివృద్ధి

డాబాగార్డెన్స్: సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలుండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 'విశాఖపట్నం–అభివృద్ధి–నిధులు–సంస్కరణల'పై ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విశ్రాంత ఆచార్యుడు సి.రామచంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా నిలబడే పునాది లేకపోయినా గాల్లో ఎగురుదామనే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, నగరాల్లో ఫ్లై ఓవర్లు, మెట్రో రైళ్లు ఎన్ని వచ్చినా, రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే దీనికి పరిష్కారమని, ప్రజా రవాణా తీసుకొచ్చినట్టయితే రద్దీ, ప్రమాదాలు, కాలుష్యం, అసహనం వంటివి తగ్గుతాయని పేర్కొన్నారు. సింగపూర్ నమూనా గురించి పదే పదే వల్లించే నేతలు ఆ సింగపూర్‌లో అమలవుతున్న రవాణా, మంచినీటి సదుపాయం కల్పన వంటి వాటిని ఇక్కడ అమలు చేయాలన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి వచ్చిందని, విశాఖపట్నానికి వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను విక్రయానికి పెడుతున్నారని, రాష్ట్ర ఖజానా నుంచి గత దశాబ్ద కాలంలో ఒక్క రూపాయి కూడా జీవీఎంసీకి ఇవ్వలేదు సరికదా జీవీఎంసీ పన్నుల ఆదాయం రూ. 350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందే తప్ప జీవీఎంసీకి ఇవ్వలేదన్నారు. పట్టణ పౌర సమైక్య కన్వీనర్ సీహెచ్ బాబూరావు



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య

మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సరైన ఉపాధి, పరిశుభ్రమైన మంచినీరు, ఉండడానికి ఇళ్లు వంటివి లేకపోతే ప్రజలు ఎలా ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ మార్కెట్ వేల్యూ ఆధారిత పన్ను కచ్చితంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగరాభివృద్ధి అజెండాలో మధ్య తరగతి వారితో పాటు మురికివాడల ప్రజల సమస్యలు కూడా అభివృద్ధిలో ప్రధాన అజెండాగా తీసుకురావాలని, పోరాడితేనే హక్కులు వస్తాయని తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం ప్రతినిధి డాక్టర్ కె.పద్మ నేతృత్వంలో కేంద్రం కార్యక్రమాల ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు, నివాస్ కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి, మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి.మధు మాట్లాడారు.